


సంపుటి : 1 జూలై 2023 సంచిక : 01 / 2023

# పరిచయం

రాష్ట్ర విభజన జరిగి 9 సంవత్సరాలు అయ్యింది. విభజన జరిగిన తర్వాత మిగిలిన 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్చారు. పట్టణాలు, నగరాలను అధికారికంగా విస్తరించారు. అర్బన్ ప్రాంతాల్లో చాలా పరిణామాలు జరుగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు ఎన్నో పరిపాలనా నిర్ణయాలు చేస్తున్నాయి. ఈ నిర్ణయాలు పట్టణ ప్రజలకు సదుపాయాలు పెరగడానికి అవకాశం ఇస్తున్నాయి. అదే సమయంలో కొన్ని అవసరమైన సదుపాయాలను దూరం చేస్తున్నాయి. అంతేకాక ఆర్ధికంగా మరియు ఇతరత్రా కొన్ని సమస్యలు తెచ్చి పెడుతున్నాయి. ప్రతి పట్టణం / నగరం లోను ప్రజలు పట్టణ ప్రజా సంఘాల సమాఖ్యలు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లను ఏర్పాటు చేసుకొని ప్రజాసమస్యలను చేపడుతున్నారు, పోరాడుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్ ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలు, ప్రజల స్పందన, ప్రతిఘటన, పోరాట వివరాలను పట్టణ ప్రజానీకానికి అందుబాటు లోనికి తెచ్చే ఉద్దేశ్యంతో ఆంధ్ర ప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య తరపున ఈ డిజిటల్ మేగజైన్ "అర్బన్ ఫోకస్" ను ప్రారంభిస్తున్నాము. దీనికి సలహాలు, సూచనలు ఇచ్చి, సమాచారాన్ని అందించి సహకరించమని ప్రార్ధన.

*– వార్సా , నివాస్*




## ముందుమాట

అర్బన్ ఫోకస్ జూలై సంచిక చదివాను. అందులో ప్రచురించిన వ్యాసాలు, ఇతర సమాచారం చాలా ఉపయోగకరమైనవి. అటువంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందించడం చాలా అవసరం. అర్బన్ ఫోకస్‌ను ప్రవేశపెడుతున్న మీ అందరికీ నా ధన్యవాదాలు, అభినందనలు.

EAS శర్మ, ఐఎఎస్
మాజీ కేంద్ర ఎనర్జీ సెక్రటరీ

# పట్టణీకరణ దృక్పథం-ధోరణులు



- ప్రొ. యన్. పురేంద్రప్రసాద్,

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ

గత మూడు దశాబ్దాలలో భారతదేశంలోని ఆర్థిక సంస్కరణల అమలు వలన పట్టణాలు పెద్ద మార్పు దిశగా ప్రయాణిస్తున్నాయి. పారిశ్రామికీకరణ ద్వారా సాధించే ఆర్థిక ప్రగతి నగరాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. దీనికి విశాఖ నగరం ఒక మంచి ఉదాహరణ. కానీ నేటి ప్రభుత్వాలు ఉపాధి, నగరాల పురోగతి అనే ఆలోచనను పక్కనపెడుతున్నాయి. ప్రస్తుతం పెట్టుబడుల ఉపసంహరణ, పరిశ్రమలను మూసివేయడం వలన ప్రభుత్వ రంగం స్థానాన్ని ప్రైవేటు పెట్టుబడులు ఆక్రమిస్తున్నాయి. అవి ఉపాధి అవకాశాలు, పట్టణీకరణ ప్రక్రియలను ప్రభావితం చేయడం ద్వారా నగరాభివృద్ధిలో మార్పులు తీసుకొస్తున్నాయి. రెండు దశాబ్దాలకు ముందు 100 శాతం పెట్టుబడుల ఉపసంహరణ జరిగిన హిందుస్థాన్ జింక్ నుండి విశాఖ స్టీల్ ప్లాంటులో పెట్టుబడుల ఉపసంహరణ ప్రయత్నాల వరకు జరిగిన పరిణామాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

పట్టణీకరణకు సంబంధించిన సమాచారం, సాహిత్యం పరిశీలిస్తే గతానికి, ప్రస్తుతానికి పొంతన ఉండదు. గతంలో నిరంతరాయంగా పల్లెలను పట్టణాలుగా అభివృద్ధి చేయడం, పట్టణాలలో సౌకర్యాలను అభివృద్ధి చేయడం, భూములను సేకరించి పెద్ద ఎత్తున నివాసయోగ్యంగా లే అవుట్లను అభివృద్ధి చేయడం, రూరల్-అర్బన్ కొనసాగింపు, పెరి అర్బనైజేషన్, శాటిలైట్ టౌన్ వంటివి నిర్మించడం అని ఉండేది. 1970, 80 దశకాలలో నగరాభివృద్ధిపై భారత దేశంలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. క్లాస్ 1,2,3 నగరాలు, నగర పరిసర ప్రాంతాలు, నగరాలలో మౌలిక వసతుల కల్పన, నగరాలను మహానగరాలుగా అభివృద్ధి చేయడం, చిన్న మధ్య తరహా పట్టణాలను నగరాలుగా అభివృద్ధి చేయడం జరిగింది. కానీ 1990 మరియు 2000 సంవత్సరాల నాటికి పట్టణీకరణ అనే ఆలోచన లోనే ఒక ముఖ్యమైన మార్పు వచ్చింది. నగరాభివృద్ధి అంటే స్మార్ట్ సిటీస్, గ్రీన్ ఫీల్డ్ సిటీస్, హైఫనేటెడ్ సిటీస్ అనే చర్చ జరుగుతోంది. ఈ నూతన పట్టణీకరణ ప్రక్రియ పట్టణ పౌరుల కోరికలను, ఆకాంక్షలను తీర్చడంలో ఎంతవరకు సఫలం అవుతాయో మనం అర్థం చేసుకోవడం ముఖ్యం. ఇక్కడ మూడు రకాల పట్టణీకరణ ధోరణులను పరిశీలిద్దాం.

మొదటిది, భారతదేశంలోని నగర ప్రజానీకం, ప్రతి నగరం ఒక ప్రపంచ స్థాయి నగరంగా / స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందాలని కోరుకుంటోంది. ఎవరి భావనలలో ఈ అభివృద్ధి మరియు ఎవరిప్రయోజనాల కోసం అనేది వేరే ప్రశ్న. వాస్తవానికి నేడు ప్రతి నగరంలోనూ కొంత ప్రాంతం ప్రత్యేక నగరంగా అభివృద్ధి అవుతున్నాయి. ఐటీ రంగం, ఎలక్ట్రానిక్, ఫైనాన్స్ రంగాలు ఈ విధమైన అభివృద్ధికి కారణమవుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో నోయిడా, గురుగావ్ ప్రాంతాలు, కలకత్తా నగరంలో రాజర్హాట్, బెంగళూరులోని ఎలక్ట్రానిక్

సిటీ, హైదరాబాదులోని హైటెక్ సిటీ లేదా సైబరాబాద్ మొదలైనవి ఇందుకు ఉదాహరణలు. ఈ ప్రాంతాలలో అభివృద్ధి కేంద్రీకృతం అవుతున్నది. ఉపాధి, మానవ వనరులు, అధికారం,నగదు చలామణీలకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. వాస్తవానికి ఈ నగర ప్రాంతాల్లోని పౌర సదుపాయాలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు బహుళజాతి కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ సర్వే ప్రకారం పరిశీలిస్తే ఈ విధమైన నగర ప్రాంతాల్లో జనాభా కేంద్రీకరణ పెరుగుతున్నది. 1991 నుండి 2001 మధ్యలో దాదాపు 75% జనాభా కేంద్రీకరణ పెరిగింది. అదే సమయంలో వ్యవసాయ భూమి 80 శాతం నుండి 26 శాతానికి తగ్గిపోయింది. నగర ప్రాంతాలు 9% నుండి 66%కి పెరిగాయి.

రెండవది, వందలాది ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించి నగరాలను నిర్మించడం జరుగుతున్నది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను వేరు చేసే చర్యల వలన సామాజిక, రాజకీయపరమైన మరియు చట్టబద్ధమైన సరిహద్దులను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ ప్రాంతాల నుండి నగరాలు వేరు పడుతున్నాయి. 70% వ్యవసాయాధారిత గ్రామీణ జనాభా ఉన్న దేశంలో ఈ విధమైన పునర్నిర్మాణం గ్రామాలు–వ్యవసాయం, గ్రామాలు–పట్టణాలు అనే అంశాలపై అనేక ప్రశ్నలతో పాటు, మన దృష్టిని సారించవలసిన అవసరాన్ని కలిగిస్తున్నది. ఈ విధమైన పట్టణీకరణ నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల మధ్యలో సామాజిక , ప్రాదేశిక అంతరాలు ఏర్పడుతున్నాయి. ఆ సామాజిక తరగతుల ప్రజలు ఎలా కలుస్తారు? విభిన్నమైన సబర్బన్ జాతులు మరియు గ్రామీణ, పట్టణ ప్రాంత ఉత్పత్తి ప్రక్రియలో వచ్చే మార్పులు మనకు ఏమి చెబుతున్నాయి?

మూడవది, ఈ రోజుల్లో వ్యవసాయ భూములు నివాస ప్రాంతాలుగా, అత్యధిక జనసాంద్రత కలిగిన నగరాలుగా మారుతున్నాయి. ఈ గ్రామాలు అనేక విధాలుగా నగరాలకు సహకరిస్తున్నాయి. నగరాలు ఏర్పడడానికి కేవలం భూములు మాత్రమే కాకుండా, నివాసాలు కోల్పోయి, వందలాది వేలాది వలస కార్మికులు ఈ కొత్తగా ఏర్పడిన నగరాలలో పనుల కోసం వస్తున్నారు. అటువంటి వారికి పబ్లిక్ హౌసింగ్ సదుపాయం లేకపోవడం వలన వారికి అద్దెలకు నివాసం కల్పిస్తూ, ఆవిధంగా కూడా నగరాలకు సహకరిస్తున్నాయి. ఈ కార్మికులు చిన్న తరహా వస్తూత్పత్తి, రిపేరింగ్, మౌలిక వసతుల కల్పన మొదలైన పనులలో నగరాలకు సహకరిస్తున్నారు. నగర దైనందిన కార్యక్రమాల్లో వారు కూడా భాగస్వాములు అవుతున్నారు. అదేవిధంగా కొన్ని గ్రామాలు సెన్సస్ పట్టణాలుగా వర్గీకరించబడుతున్నాయి. ఇవి గ్రామాలుగానే ఉంటాయి, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పాలనాపరంగా వీటిని నగరాలుగా ప్రకటించలేదు. **'సెన్సస్ పట్టణాలు'** అంటే 5 వేలకు పైబడిన జనాభా ఉండి, ముఖ్యంగా మగ కార్మికులలో 75% పైగా వ్యవసాయ పనులు కాకుండా ఇతర పనుల్లో ఉపాధి పొందుతున్న గ్రామాలు.

## నూతన పట్టణీకరణలోని ఆందోళనకర అంశాలు

మొదటి అంశం, భారతదేశ నగరాలు ఈ మధ్యకాలంలో అనేక వాతావరణ, పర్యావరణ మార్పులకు గురై మనుగడ సాగించలేని విధంగా మారుతున్నాయి. ప్రధాన నగరాలైన చెన్నై, బెంగళూరు, శ్రీనగర్, ముంబై, హైదరాబాద్ ఇటీవల కొన్ని సంవత్సరాలలో వరదలకు గురి అయ్యాయి. వాతావరణ మార్పులు పెరుగుతున్న కొద్దీ పర్యావరణ ఉత్పాతాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులను పరిగణనలోకి

తీసుకోకుండా నూతన రాజధాని నగరాలను వరదలు వచ్చే ప్రాంతాలలో నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అటవీప్రాంతాలను డీ-నోటిఫై చేసి నిర్మాణాలను చేపడుతున్నారు. తూర్పు కనుమలలో అడవులను నిర్మూలించడం ద్వారా వృక్ష సంపద, జంతుజాలం నాశనమయ్యే ప్రమాదం ఉంది. అటవీ సంపద నాశనం కావడమే కాకుండా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఇటీవల విశాఖ నగరంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు ఇందుకు ఉదాహరణ. విశాఖ నగరం భూమి మార్పిడికి ఒక కేంద్రంగా మారింది. అమ్మకాలు, ఆక్రమణలు, భూసేకరణలు, తాకట్టులు ఈ విధంగా వివిధ రూపాల్లో భూమి చేతులు మారుతోంది. ప్రభుత్వాలు కూడా విచక్షణా రహితంగా కొండలను ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్నాయి. పర్యావరణాన్ని నాశనం చేసే ఈ విధమైన భూ మార్పిడి విశాఖ నగరాన్ని అభివృద్ధి చేస్తుందా? నగర నివాసితుల సంక్షేమ సంఘాలు నగరాభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషించాల్సి ఉంది. పౌరుల సంక్షేమం, వారి ఆకాంక్షలను హక్కులను కాపాడడంతోపాటు విశాఖ నగరాన్ని మనుగడ సాగించలేని పరిస్థితికి చేరకుండా కాపాడుకోవలసిన బాధ్యత నగర నివాసితుల సంక్షేమ సంఘాలకు ఉంది.

రెండవ అంశం, ఈ తరహా పట్టణీకరణ వలన నగర జనాభాలో అంతరాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు గ్రామీణ ప్రాంత, నగర పేదలు, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, వలస కార్మికులు నగర జనాభాలో భాగస్వాములు కాలేకపోతున్నారు. గతంలో విశాఖపట్నంలోని పేద ప్రజానీకానికి, వలస వచ్చిన వారికి నివాసాలు ఏదో ఒక విధంగా ప్రభుత్వాలే ఏర్పాటు చేసేవి. నేడు మారుతున్న పట్టణీకరణ పరిస్థితులలో ఇటువంటి నివాసాల గురించి ఆశించడం కూడా అసాధ్యంగా మారింది.

మూడవ అంశం, ప్రభుత్వాలు నగరాలలో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే కార్యక్రమాలను చేపట్టడం, ప్రజానీకానికి సౌకర్యాలను పెంచడం అనే ఆలోచనను పక్కనపెట్టి ఆస్తిపన్ను పెంపు, చెత్త పై పన్ను , త్రాగునీరు, మురుగునీరు వసతులను ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పడం వలన నగరంలో అత్యధిక సంఖ్యలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజానీకంపై భారం పెరుగుతున్నది.

సంక్షిప్తంగా చెప్పాలంటే మనం పౌర సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా చక్కటి పౌర సమాజాన్ని నిర్మించడం ద్వారా మాత్రమే విశాఖ నగరాన్ని నివాసయోగ్యమైన మరియు సుందర నగరంగా అభివృద్ధి చెందేలా కాపాడుకోగలం.

# విద్యుత్ నిలువు దోపిడి




- సిహెచ్.బాబూరావు,
కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య (APUCF)

**జగనన్న ప్రభుత్వం దొంగదెబ్బ**
**ఒకేసారి మూడు రకాల సర్దుబాటు చార్జీల భారం**
**ఆరువేల కోట్ల రూపాయల అదనపు భారం**
**ఒకవైపు ఎండలు, మరోవైపు ప్రభుత్వ విద్యుత్ షాక్**
**పెరిగిన విద్యుత్ బిల్లులతో జనం గగ్గోలు**
**ప్రజల నెత్తిన భారం మోపి బడా కంపెనీలకు మేలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**
**పేదల నడ్డి విరుస్తున్న జగన్ సర్కార్**
**బాధ్యత నుండి తప్పించుకోలేని తెలుగుదేశం.**
**విద్యుత్ భారాలపై మరో పోరుకు ప్రజలు సిద్ధం కావాలి!**
**విద్యుత్ సంస్కరణల ప్రమాదాన్ని ఎదుర్కోవాలి!**

విజయవాడలోని అజిత్ సింగ్ నగర్, పాయకాపురం, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, ఇంటింటికి తిరిగి విద్యుత్ బిల్లులను పరిశీలించాము. ఒకటో తేదీ నుండి వస్తున్న బిల్లులు చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండల తీవ్రతలో, విద్యుత్ ఎక్కువ వినియోగించుకున్నారని అందుకే బిల్లులు ఎక్కువ వస్తున్నాయని ప్రభుత్వం ప్రజలను మభ్యపరుస్తున్నది. గతంలో ఏనాడు లేనంతగా బిల్లులు వచ్చాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. జగనన్న ప్రభుత్వం విద్యుత్ బిల్లులతో ప్రజల నడ్డి విరిచిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసారు.

- ఒకేసారి మూడు రకాల ట్రూ అప్, సర్దుబాటు చార్జీల భారాన్ని రాష్ట్రములోని ప్రజలందరిపై రాష్ట్ర ప్రభుత్వం మోపింది.
- వినియోగించుకున్న విద్యుత్ కు బిల్లులు కట్టినప్పటికీ, ప్రభుత్వం లోటు చూపిస్తూ, ఆనాడు వాడుకున్న విద్యుత్ పై సర్దుబాటు చార్జీలు వసూలు చేయటం దుర్మార్గం.
- 2014 నుండి 19 వరకు వినియోగించుకున్న విద్యుత్ కు ట్రూ అప్ చార్జీల పేరుతో 2900 కోట్ల రూపాయలు భారం మోపారు, ఇప్పటికే 11 నెలలు నెలకు యూనిట్ కి 20 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారు. మరొక 25 నెలల పాటు ఇది కొనసాగుతుంది.

- 2021- 22 లో వినియోగించుకున్న విద్యుత్ కు 3083 కోట్ల రూపాయల భారం తాజాగా మోపారు.
- 2021 మే నెలలో వినియోగించుకున్న విద్యుత్ కు యూనిట్ 20 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీల (FPPCA)భారం ఈ బిల్లులో వేశారు .
- 2023 ఏప్రిల్ నెలలో వినియోగించుకున్న విద్యుత్ కు మే నెలలో బిల్లులు చెల్లించారు, మళ్లీ నెల రోజుల క్రితం వాడుకున్న కరెంటుకు 40 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీలు ఈ బిల్లులో మోపారు.
- ఈ విధంగా ప్రస్తుతం వాడుకున్న విద్యుత్ కు మాత్రమే కాకుండా, గతంలో వాడుకున్న విద్యుత్ కు మూడు రకాలుగా యూనిట్ కు 80 పైసలు చొప్పున వసూలు చేయటం దారుణం.
- ఈ భారం పేద, మధ్యతరగతి ప్రజలపైన, పేదలపైన అధికంగా పడుతున్నది.
- ప్రస్తుతం వినియోగించుకున్న విద్యుత్ బిల్లులు కాకుండా అదనంగా 10 శాతం నుండి 51 శాతం వరకు ఈ సర్దుబాటు చార్జీల భారం పడింది.
- సుమారు 6000 కోట్ల రూపాయలు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రత్యక్షంగా భారం మోపింది.
- గత సంవత్సరం చార్జీలు పెంచారు, శ్లాబులు మార్చారు. ఆనాడు 1500 కోట్ల రూపాయల భారం పడింది. అది ఈ సంవత్సరం కూడా కొనసాగుతోంది.
- ఫిక్స్డ్ చార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం పేరుతో కళ్ళకి కనపడకుండా మరిన్ని భారాలు కొనసాగుతున్నాయి.
- పెత్తందారులపై పోరాటం, పేదల కొరకు జరుగుతున్న వర్గ పోరాటం అంటూ ప్రజలను జగన్ వంచిస్తున్నారు. కానీ, పేదలపైనే ఈ విద్యుత్ భారం అధికంగా పడుతున్నది.
- కనీస చార్జీలు చెల్లించే వారిపై ఈ చార్జీలు విపరీతంగా పడుతున్నాయి.
- కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయడం కోసమే పేద, మధ్యతరగతి వినియోగదారులపై ఈ భారం మోపుతున్నది.
- కేంద్రంలోని మోడీ సర్కార్ తెచ్చిన విద్యుత్ సంస్కరణను తు. చ. తప్పక అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల జేబులు నింపుతోంది.
- బొగ్గు, ఇంధనం పేరుతో ఆదానీ తదితర కంపెనీలు కోట్లు కొల్లగొట్టాయి, ఆ భారం ఇప్పుడు ప్రజలపై వేస్తున్నారు
- అధిక రేట్లు పెట్టి విద్యుత్ కొనుగోలు చేశారు, ఇందులో పెద్ద ఎత్తున రాజకీయ అవినీతి చోటు చేసుకుంది, విద్యుత్ సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రజలపై వేస్తున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వ అపసవ్య విధానాలతో విద్యుత్ రంగం అస్తవ్యస్తమయ్యింది, వాటి దుష్ఫలితాలను ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై అడ్డగోలుగా వేస్తున్నారు.
- గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వినియోగించుకున్న విద్యుత్ కు కూడా ఈరోజు ట్రూ అప్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ నేరంలో తెలుగు దేశం పాత్ర కూడా వుంది. కాబట్టి, విద్యుత్ బాదుడులో తెలుగుదేశం ప్రభుత్వం బాధ్యత నుండి తప్పించుకోలేదు.

- విద్యుత్ సంస్కరణల విషయంలో బిజెపి, వైసిపి, తెలుగుదేశం అందరిదీ ఒకటే దారి.
- అధికారంలో వున్నప్పుడు అవే వినాశకర సంస్కరణను అమలు చెయ్యడం. ప్రతిపక్షం లో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పెంపుదలను విమర్శించడం కానీ, ఈ చార్జీల పెంపుదలకు ప్రధాన కారణమైన సంస్కరణలను, విద్యుత్‌రంగ ప్రైవేటీకరణను ఈ మూడు పార్టీలు ఏనాడూ వ్యతిరేకించలేదు.
- సిపియం , సిపిఐ ఇతర వామపక్షాలు తొలి నుండి కార్పొరేట్ అనుకూల సంస్కరణలను, విద్యుత్ ప్రైవేటీకరణ ప్రమాదాన్ని హెచ్చరిస్తూనే ఉన్నాయి. విద్యుత్తు నియంత్రణ మండలి సమావేశాలలో సర్దుబాటు చార్జీలపై నికరంగా పోరాడుతున్నాయి.
- ఈ ప్రభుత్వాలు ప్రజల కళ్ళు కప్పుతున్నాయి.
- బిల్లులు వచ్చినప్పుడు మాత్రమే ఈ ప్రమాదం ప్రజలకు తెలుస్తున్నది. ఈ విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం నిరంతరం కొనసాగుతుంది.
- 2014 -19 సంవత్సరాలకు చెందిన సర్దుబాటు చార్జీలు మరో 25 నెలలపాటు, 21-22 సంవత్సరాల సంబంధించిన సర్దుబాటు చార్జీలు మరో 10 నెలలపాటు, 2023 నుండి గత నెలల వినియోగించుకున్న విద్యుత్ పై అదనపు సర్దుబాటు చార్జీలు తదుపరి నెల వేస్తారు. ఇలా ప్రతి నెల వేస్తారు.
- వంటగ్యాస్ ప్రతినెల, పెట్రోల్, డీజిల్ ప్రతిరోజు పెరిగినట్టే విద్యుత్ ఛార్జీలు ప్రతినెలా పెరుగుతాయి.
- ఈ విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టగా, రాష్ట్ర ప్రభుత్వం గుడ్డిగా ఆమోదించి అమలు చేస్తున్నారు.
- హిందుజా కంపెనీకి అడ్డగోలుగా చెల్లించిన 1200 కోట్ల రూపాయలు మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నెత్తిన వేస్తారు.
- ప్రజలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ విధానాలను గమనించి తిప్పి కొట్టాలి.
- విద్యుత్ రంగంలో ప్రత్యామ్నాయ విధానాలు కావాలి.
- ప్రైవేటీకరణ విడనాడి, ప్రభుత్వం రంగంలో విద్యుత్ రంగాన్ని కొనసాగాలి.
- తక్షణమే అన్ని రకాల ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దుచేసి ప్రభుత్వమే భరించాలి, సర్దుబాటు చార్జీల విధానాన్ని రద్దు చేయాలి.
- విద్యుత్ కొనుగోలులో అవినీతి అరికట్టాలి.
- బడా కార్పొరేట్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకోవాలి.

విద్యుత్ బిల్లులలో సర్దుబాటు చార్జీల బండారం:

- విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లో ఒక వినియోగదారుడు 12 యూనిట్లు వినియోగించుకున్నారు.
- దానిపై రు.22.80 పైసలు చార్జీ వేశారు
- అదనంగా ఫిక్స్‌డ్ చార్జీలు రు.20 లు.
- కస్టమర్ చార్జీలు 25 రూ.లు.
- మూడు రకాల ట్రూ అప్ / సర్దుబాటు చార్జీలు రు. 55.65, 28.35, 13.60 .లు అన్నీ కలిపి 97. 60 పైసలు(మొత్తం బిల్ లో 51%)

- ➔ మొత్తం అన్నీ కలిపి 191 రూపాయలు బిల్లు వచ్చింది.
- ➔ మొత్తం బిల్లులో ఆ నెలలో  వినియోగించుకున్న విద్యుత్ కు బిల్లు 12 శాతం
- ➔ 88% కొసరు చార్జీలు.
- ■ మరొక వినియోగదారుడు గత నెలలో విద్యుత్  పెద్దగా వినియోగించలేదు.
- ➔ ఒకే ఒక్క యూనిట్ వాడారు. 1.90 పైసలు చార్జీ వేశారు.
- ➔ మొత్తం బిల్లు 86 రూపాయలు.
- ➔ ఆ నెలవాడిన కరెంటు బిల్లు 2.21%
- ➔ సర్దుబాటు, ఇతర చార్జీలు 97.79%.
- ■ మరొక వినియోగదారుడు వినియోగించుకున్న విద్యుత్తుకుబిల్లు 3659 రూ॥
- ➔ సర్దుబాటు చార్జీలు 54.56, 89.65, 154.80
- ➔ మొత్తం సర్దుబాటు 300 రూపాయలు (10%).
- ■ మరో వినియోగదారుడు 101 యూనిట్లు వినియోగించుకోగా 309 రూపాయలు విద్యుత్ చార్జీ వేశారు
- ➔ సర్దుబాటు చార్జీలు 123.71 పైసలు( 40% )
- ➔ ఫిక్సడ్, కస్టమర్, ఇతర చార్జీలు అన్ని కలిపి 519 రూపాయలు.

## విద్యుత్ సర్దుబాటు చార్జీలు, భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమం

**– ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య (APUCF) పిలుపు**

ఆంధ్ర ప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య రాష్ట్ర సమావేశం జూన్ 19 న ఆన్ లైన్ లో జరిగింది. సమావేశానికి వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కన్వీనర్ సిహెచ్. బాబురావు నివేదికను ప్రవేశపెట్టారు. వివిధ జిల్లాల పౌర సంఘాల నేతలు పట్టణాల్లోని ప్రజా సమస్యలను వివరించారు. సమావేశం ఈ దిగువ తీర్మానాలు చేసింది.

- ♦ పట్టణ ప్రజలపై విద్యుత్ భారం తీవ్రంగా ఉంది. సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు, అదనపు కస్టమర్ డిపాజిట్లు తదితర వివిధ రూపాలలో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తున్నది. స్మార్ట్ మీటర్లు వలన కార్పొరేట్ కంపెనీలకు తప్ప, ప్రజలకు ప్రయోజనం ఏమీ లేదు, పైగా తీవ్ర భారం పడుతుంది. చిరు వ్యాపారుల మొదలు చిన్న పరిశ్రమల వరకు ప్రతి ఒక్కరూ విద్యుత్ బాధితులే. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో వర్తక, వాణిజ్య సంఘాలు, కాలనీ, అపార్ట్మెంట్ అసోసియేషన్లు, పౌర సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలి. ఐక్యవేదికలు ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయి మొదలు రాష్ట్రస్థాయి  వరకు ప్రజల భాగస్వామ్యంతో వివిధ రూపాలలో ఉద్యమాలు చేపట్టాలి. సంతకాల సేకరణ చేయాలి.

- 2023- 24 ఆర్థిక సంవత్సరంలో మరోసారి ఇంటి పన్నులు( ఆస్తి పన్ను) 15 శాతం పెంచడం దారుణం. ఇది వరుసగా మూడవ సంవత్సరం పెంపుదల. మరోవైపు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల కొరకు భూముల విలువలను పెంచింది. దీని వలన ఆస్తి విలువలు పెరిగి ఇంటి పన్నులు మరింత పెరుగుతాయి.
- కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లోబడి రాష్ట్రం యూజర్ చార్జీ (చెత్త పన్ను) వసూలు వేగవంతం చేసింది. ప్రజలను బెదిరించి మరీ చెత్త పన్ను వసూలు చేయడం దుర్మార్గం. పారిశుధ్య నిర్వహణను, ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం, స్థానిక సంస్థలు చెత్త పన్ను వసూలు చేయడం అమానుషం.
- ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం, యూజర్ చార్జీలు ఇతర ప్రజా వ్యతిరేక పట్టణ సంస్కరణల అంశాన్ని రాబోయే కాలంలో ప్రజా అజెండాగా మార్చాలి. ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను నిలదీయాలి. న్యాయపోరాటంతో పాటు ప్రజా పోరాటం ఆస్తిపన్ను, చెత్త పన్నుపై కొనసాగించాలి.
- వేసవిలో మంచినీటి ఎద్దడిని అరికట్టడంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు పూర్తిగా విఫలమయ్యాయి. రాబోయే వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ముందస్తుగా చర్యలు తీసుకోవాలి.
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పాలకవర్గాలు ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిపోయినా అభివృద్ధి పనులు ముందుకు సాగటం లేదు. పాలక పార్టీ ప్రజాప్రతినిధులు సైతం నిలదీసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను మళ్లిస్తూ ఖజానా నింపుకుంటున్నది. అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి పట్టణంలోనూ వినతి పత్రాలు రూపొందించి స్థానికంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలి.
- గృహ నిర్మాణం, ఇళ్ల స్థలాల పంపిణీ, పట్టాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం అయింది. పలు పట్టణాల్లో టిడ్కో ఇళ్ల కేటాయింపు జరగలేదు. జగనన్న కాలనీల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. పేదల నుండి బలవంతంగా 35 వేల రూపాయలు మొదలు లక్ష రూపాయలు వరకు ఇళ్ల నిర్మాణాలకు వసూలు చేస్తున్నారు. ఎన్నో దశాబ్దాల నుండి నివసిస్తున్న పేదలకు ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించడం లేదు. రిజిస్ట్రేషన్లు చేయటం లేదు. పైపెచ్చు జగనన్న కాలనీలు, రాజధానిలో ఇళ్ల స్థలాల పేరిట పేదల ఇళ్లను తొలగించడానికి ప్రయత్నించడం శోచనీయం. ఇళ్లు, పట్టాలు, మౌలిక సదుపాయాల కల్పనపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలి.

**అభివందనములతో**

**సిహెచ్ బాబురావు,**

**కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య**

## భూముల ధరల పెంపుదలపై



### రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ KS జవహర్ రెడ్డికి
### మాజీ కేంద్ర ఎనర్జీ సెక్రటరీ శ్రీ EAS శర్మ, ఐఎఎస్ రాసిన లేఖ

2021 లో ఇంటిపన్ను ను ఆస్తిపన్ను గా మార్చి, ఆస్తిపన్నును ఆస్తి విలువకు లింక్ పెట్టినప్పుడు, అది చట్ట వ్యతిరేకమని తెలియపరుస్తూ నేను మీకు 28.06.2021న లేఖ రాశాను. రుణగ్రస్తమైన రాష్ట్రానికి అవసరమైన నిధుల కోసం ఇటీవల రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటు వారు భూముల విలువలు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. భూముల విలువలు పెరిగితే, ఫలితంగా మునిసిపాలిటీలలో తత్సంబధిత ఆస్తిపన్నులు పెరుగుతాయి. వారి ప్రమేయం లేకుండానే పెరిగిన ఈ ఆస్తి పన్ను భారాన్ని ప్రజలు భరించవలసి వుంటుంది. ఇలా పెంచిన భారాన్ని భరించవలసిన ప్రజలకి వారి గోడు వినిపించుకొనే అవకాశం ముందుగా ఇచ్చి ఉండాల్సింది. కానీ, మన రాష్ట్రములోని ఏ మునిసిపాలిటీలోనూ ప్రజలకి ఆ అవకాశం ఇవ్వలేదు. కాబట్టి, మునిసిపాలిటీలలో ఏకపక్షంగా పెంచిన భూముల ధరలను పరిగణన లోనికి తీసుకొని ఆస్తి పన్ను నిర్ణయించడం చట్ట విరుద్ధం.

అందువలన, ఈ చర్య లో ఇమిడి వున్న చట్టబద్ధతను పరిశీలించి, మున్సిపాలిటీలకు తగిన సూచనలను ఇవ్వ వలసిందిగా కోరుతున్నాను.

## సవాలు

### (బలసోర్ రైలు ప్రమాదం పై కవిత )

**గోలి మధు (తేది 3.6.2023)**

ఈరోజు కనిపిస్తున్న
ఆ శవాల తోరణానికి
మునుపే
ముహూర్తం ఖరారైంది
ప్రజా సంపద
పెట్టుబడి దారునికి
పంచినపుడే
ఆ ప్రాణాలకు
చావు ముహూర్తం
ఖాయమైంది...

రైలు పట్టాలు ఒకరు
భోగీలు ఇంకొకరు
ఇంజను మరొకరు
చెరబట్టినప్పుడే
మృత్యు ఘంటికలు మ్రోగాయి
అక్కడ కనిపించే
మృత దేహాల వెనుక
కార్మిక లేమి....
నైపుణ్య లేమి...

మరిన్ని మరణాలకు
ముహూర్తం పెట్టే పనిలో..
నువ్వూ నేనూ నిద్ర పోతే
రేపు ఆ శవాలం మనమే...
సవాలు విసురుదాం
విరుచుకు పడండి
మన ఉద్యమ నేపథ్యం
ఉదయాల్ని మరచి
చాలాకాలం అయింది.

# పెంచిన విద్యుత్ చార్జీలపై విజయనగరం లో రౌండ్ టేబుల్ సమావేశం

ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని విజయ నగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మాణం చేసింది, విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు కంది త్రినాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై విద్యుత్ చార్జీలను అమాంతంగా పెంచి 1400 కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని ఆరోపించారు. గతంలో సంవత్సరానికో , రెండు సంవత్సరాలకో విద్యుత్ చార్జీలు పెంచేవారు. కానీ ఇప్పుడు మరీ దారుణంగా ప్రతి నెల విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటివరకు కరెంట్ బిల్లు చెల్లించినా , సర్దుబాటు చార్జీలు పేరుతో 6000 కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై మోపారని అన్నారు. నాలుగేళ్లలో 26 వేల కోట్ల రూపాయలు కరెంటు చార్జీల భారాలు ప్రజల నెత్తిన మోపారని అన్నారు. సాయి అమృతా రెసిడెన్సీ కార్యదర్శి US రవికుమార్ మాట్లాడుతూ 1999లోనే విద్యుత్ సంస్కరణలు నాటి వాజ్ పాయ్ ప్రభుత్వం ప్రారంభించింది. నేటి మోడీ మరింత వేగంగా అమలు చేస్తున్నారని అన్నారు. ఛాంబర్ అఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ V.సతీష్ గారు మాట్లాడుతూ రాబోయే కాలంలో స్మార్ట్ మీటర్లు తెస్తారు. వాటిని ఇప్పటినుండే త్రిప్పికొట్టాలని అన్నారు. అయ్యప్పనగర్ కాలనీ కార్యదర్శి KVPS జిల్లా కార్యదర్శి రాకొటి ఆనంద్, రజక సంఘం జిల్లా నాయకులు భాస్కరరావు , చిన్నా, నాలుగువతరగతి ఉద్యోగుల సంఘం నాయకులు ప్రసాద్ , ఐద్వా జిల్లాకార్యదర్శి P. రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వాటర్ ప్లాంట్ ను రద్దు చేయాలని ధర్నా

విజయనగరం లోని అయ్యప్ప నగర్ కాలనీ లో అక్రమ వాటర్ ప్లాంట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ పౌర సంక్షేమ సంఘం, అయ్యప్ప నగర్ కాలనీ వాసులు వాటర్ ప్లాంట్ ముందు ధర్నా నిర్వహించారు.

2014 సంవత్సరం నుంచి అక్కడ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి నగర వాసులకు నీరు లేకుండా




చేస్తున్నారు. పెద్ద మోటార్లు పెట్టి నీటిని తోడేయడం వలన భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. అక్రమంగా నడుపుతున్న వాటర్ ప్లాంట్లు రద్దు చేయాలని, ఆ ప్రాంత ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మున్సిపల్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్‌కి, జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదులిచ్చినా చర్యలు తీసుకోలేదు. అయితే, పట్టణ పౌర సంక్షేమ సంఘం ధర్నాకి పిలుపునివ్వడంతో మున్సిపల్ అధికారులు వెంటనే

జోక్యం చేసుకొని, అక్రమమైన వాటర్‌ప్లాంట్‌కి తాళం వేసి సీజ్ చేశారు. మరలా ఓపెన్ చేస్తే ప్లాంట్ యజమానులపై క్రిమినల్ కేసులు పెడతామని రెండవ పట్టణ సీఐ లక్ష్మణరావు తెలిపారు. అంతకు ముందు ధర్నాకు వచ్చిన వారితో ప్లాంట్ యాజమాన్యానికి చెందినవారు వాగ్వివాదానికి దిగారు. పోలీసులు వారిని అడ్డుకుని హెచ్చరించారు. ధర్నాలో అయ్యప్ప నగర్ నాయకులు యు ఎస్ రవికుమార్, కార్యదర్శి సుధీర్, PPSS కార్యదర్శి రెడ్డి శంకర్ రావు, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.



విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం, పోరాడి రామకృష్ణా నగర్‌లో బోరు వేయించడం జరిగింది. ఈ బోర్‌ను 26 జూన్ 2023న విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు ప్రారంభించారు.





శ్రీకాకుళంలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రచారం

.

శ్రీకాకుళం జిల్లా పాలకొండలో విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలకు వ్యతిరేకంగా జూన్ 03 న నిరసన ప్రదర్శన

## పెంచిన భూముల విలువపై కర్నూలులో రౌండ్ టేబుల్ సమావేశం





కర్నూలు మేయర్ కు వినతి పత్రం ఇస్తున్న PPSS ప్రతినిధి బృందం

రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ పెంచడంతో ఆస్తి పన్ను భారీగా పెరుగుతుందని, వెంటనే పెంచిన భూమి విలువలు తగ్గించాలని, లేనట్లయితే కోర్ట్ లో సవాలు చేస్తామని రౌండ్ టేబుల్ సమావేశంలో కర్నూలు పట్టణ పౌర సంఘాల సమాఖ్య హెచ్చరించింది. గత ఏడాది భూములు, భవన నిర్మాణాల విలువలు పెంచారని, వీటితో బాటు యూజర్ చార్జీలు కూడా రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని, పెరిగిన ఆస్తి పన్ను ప్రజలు భరించలేకున్నారని రౌండ్ టేబుల్‌లోని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కర్నూలు పట్టణ పౌర సంఘాల సమాఖ్య (PPSS) నాయకులు EPR నాగరాజు, ఐలు నాయకులు D.వెంకట స్వామి, ఛాంబర్ అఫ్ కామర్స్, పెట్రోల్ బంక్‌ల సంఘం నాయకులు పాల్గొన్నారు. భూముల విలువ పెంపుదలను తిరస్కరించాలని అన్ని పార్టీలకు చెందిన MLA లకు వినతి పత్రాలు ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. అనంతరం, మేయర్ గారికి, MLA అఫ్ఫీష్ ఖాన్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

### నంద్యాలలో నీటి కుళాయిల చార్జీలపైన వ్యతిరేకత

నంద్యాలలో నీటి కుళాయిపెంచడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం రు. 200/- లకే నీరు అందిస్తామని, కుళాయి లు వేయించు కోమని చెప్పింది. అప్పుడు కుళాయి లు వేయించు కున్నాము. కానీ, ఇప్పుడు నంద్యాల మున్సిపాలిటీ వారు ఇంటి వాడుకకి, కమర్షియల్ కి భారీగా పెంచేశారు. తట్టుకోలేకపోతున్నామని PPSS నాయకత్వంలో ఆందోళన చేస్తున్నారు.

### స్థానిక సమస్యలపై పోరాటం

కర్నూలు లో స్థానిక సమస్యల పై PPSS తరచుగా జోక్యం చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నది. ప్రధాన రోడ్ల పైన సిమెంటు దిమ్మెలు నిర్మించి, వాటి పైన మొక్కలు నాటి, అవి పెరగడం లేదని మట్టిని తరచూ మార్చుతూ లక్షలాది రూపాయలు వృధా చేస్తున్నారు. ఒక అధికారి సిమెంటు దిమ్మె లు వేయిస్తాడు, ఇంకో అధికారి వాటికి ఇరు వైపుల కాంక్రీట్ గోడలు నిర్మిస్తాడు, ఇంకో అధికారి మట్టి వేయించి మొక్కలు నాటిస్తాడు. అవి పెరగడం లేదని ఇంకో అధికారి ఆ మొక్కలను తీయించేస్తాడు. ఇలా దాదాపు 50 లక్షల రూపాయలు ప్రజాధనం వృధా చేసారని PPSS ఆందోళన చేసారు.

మూడు నెలల క్రితం కర్నూలు లో మున్సిపాలిటీ ఇంజనీరింగ్ డిపార్టుమెంటు వారు రోడ్ల పైన గుంతలు తవ్వారు. కానీ ఇప్పటి వరకు పూడ్చ లేదు. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలులో ఇటీవల ఒక పాత సామాన్ల సంస్థలో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఆర్పడానికి 3 ఫైర్ ఇంజన్లు రావలసి వచ్చింది.

ఫైర్ ఇంజన్ల కొరత వుంది. మరిన్ని ఫైర్ ఇంజన్లు అందుబాటులోకి తెచ్చుకోవలసిందిగా PPSS డిమాండ్ చేసింది.

కర్నూలులో ప్రజల రక్షణార్థం KC కాలువకి ఇరు వైపుల 4 కిలో మీటర్ల దూరం 2 కోట్ల రూపాయలు ఖర్చు చేసి కంచె వేయించారు. అయితే, కంచెకు రక్షణ కల్పించడంలో మున్సిపాలిటీ విఫలమయింది. దాదాపు సగం కంచె మాయమయింది. కొంత కాలువలో పడి పోయింది. కొంత దొంగలెత్తుకు పోయారు. జూలై 6 న PPSS బృందం KC కెనాల్ పర్యటించింది. కలెక్టర్ జోక్యం చేసుకొని, దీని పైన విచారణ జరిపించాలని, మళ్ళీ కంచె వేయించాలని డిమాండ్ చేసింది.

కర్నూలు లో ఈ మధ్య ప్రధాన రోడ్లకు ఇరువైపుల వున్న బస్సు షెల్టర్లను కూల్చి వేసి, వాటి స్థానంలో కొత్త బస్సు షెల్టర్‌లను నిర్మిస్తున్నారు. నగరాన్ని అందంగా తీర్చిదిద్దడం కోసం ప్రధాన రోడ్ల పై వున్న బస్సు షెల్టర్లు శిధిలం కాకపోయినప్పటికీ మార్చేస్తున్నారు. కానీ అవసరమైన ఇతర రోడ్లలో బస్సు షెల్టర్లు నిర్మించడం లేదు. ఈ విధంగా 3 నుండి 4 కోట్ల రూపాయలు వృధా అవుతున్నది. PPSS ప్రతినిధి వర్గం ఆయా ప్రాంతాల్లో పర్యటించి, ప్రజాధనం వృధా చేయవద్దని మున్సిపల్ కౌన్సిల్‌ను కోరింది.

## విశాఖపట్నం :

### రెజ్లర్ల పోరాటానికి మద్దతు

మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బిజెపి కి చెందిన రాజ్యసభ సభ్యుడు బ్రిజ్ భూషన్‌శరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జూన్ 02 వ తేదీన LIC బిల్డింగ్ వద్ద నున్న భారతరత్న బాబా సాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వార్వా , నివాస్ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించాయి.



## ౨౦ A బస్సు ను పునరుద్ధరించాలి

04-06-2023న హెచ్.బీ.కాలనీ లాస్ట్ బస్సు స్టాప్ వద్ద 20A సిటీ బస్సును పునరుద్ధరించాలని




డిమాండు చేస్తూ వార్వా , నివాస్ మరియు హెచ్.బీ.కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కరోనా సమయంలో ఈ బస్సును రద్దు చేశారు. మళ్ళీ పునరుద్ధరించ లేదు. గతంలో APSRTC RM (Operations) ను కలిసి వినతిపత్రం సమర్పించాయి. కానీ, బస్సులు ఖాళీగా నడుస్తున్నాయని APSRTC వారు వింతైన వాదనలు చేస్తున్నారు. జనాభా పెరుగుతున్నది. ప్రజల అవసరాలు పెరుగుతున్నాయి. సిటీ బస్సులు లేనందువలన ప్రజలు ఇతర వాహనాల్లో వెళ్తున్నారు. అంతే గానీ, బస్సు అవసరం లేక కాదు. కనీసం రద్దీగా ఉండే సమయంలోనైనా, రూటు దూరం పెంచయినా 20A బస్సును నడపవలసిన ఆవశ్యకత ఉన్నది. సామాజిక సదుపాయాలను లాభార్జనతో ముడిపెట్టడం సరైనది కాదని APSRTC అధికారులు గుర్తించాలని కోరుతూ నిరసన ప్రదర్శన చేశారు.

## Blasting of Heavy Rocks in Siripuram A Nuisance

విశాఖ నగరంలోని సిరిపురంలో Baptist Church of Northern Circars (CBCNC) స్థలంలో భవన నిర్మాణాల కోసం బండ రాళ్ళను పేల్చనున్నారని తెలిసి ఆ ప్రాంతంలోని అపార్ట్మెంట్ లు, కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. నగర నడిబొడ్డున సిరిపురం ప్రాంతమంతా అపార్ట్మెంట్లు, వాణిజ్య సముదాయాలతో నిండి ఉంటుంది. నిత్యం రోడ్లన్నీ వాహనాలతో నిండి, రద్దీగా ఉంటాయి. ఇటువంటి స్థలంలో బాంబులు, డిటోనేటర్లతో పేలుళ్ళు జరిపితే ఆ ప్రాంతవాసులు ఇబ్బందులకు గురవుతారు, ఆ రోడ్లపై తిరిగే వాహనదార్లు ఇబ్బంది పడతారు. ముఖ్యంగా బాంబు పేలుళ్ళ వలన వచ్చే ప్రకంపనలకు ఆ చుట్టుపక్కల వుండే అపార్ట్మెంట్లు, భవనాలు, వాటి పునాదులు దెబ్బతినే ప్రమాదముంది. ఇతర పర్యావరణ సమస్యలు కూడా తలెత్తవచ్చు. చుట్టుపక్కల భవనాల్లో వుండే వృద్ధులకు, జబ్బుతో వున్నవారికి ఈ పేలుళ్ళ శబ్దాలు హాని కలిగించే అవకాశముంది. పేలుళ్ళ శబ్దాలు గాని, పేలుళ్ళ వలన ఎగిరే రాయి రప్ప గాని ప్రజలకు ప్రమాదాలు కలిగించ వచ్చు. కాబట్టి, ఈ అంశంలో తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నామని వార్వా , నివాస్ పత్రికా ప్రకటన ఇచ్చారు. స్థానిక అపార్ట్మెంట్ల వారు కూడా అభ్యంతరం తెలుపడం తో బాంబులు పేల్చడం తాత్కాలికంగా ఆగింది.

## చెత్త పన్నుకి వ్యతిరేకంగా గాజువాకలో నిరసన




గాజువాక 67 వ వార్డు అశోక్ నగర్ సచివాలయం వద్ద చెత్త పన్ను, విద్యుత్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీనిలో వార్వా , నివాస్ గాజువాక జోన్ నాయకత్వంతో బాటుగా 67వ వార్డు హౌస్ ఓనర్స్ సంఘం నాయకులు, సభ్యులు కూడా పాల్గొన్నారు.

## రుషికొండ బీచ్‌లో ప్రవేశ రుసుము

రుషికొండ బీచ్ లోనికి ప్రవేశ రుసుము రు. 20/- లు వసూలు చేస్తామని, ఇది జూలై 11 వ తేదీ నుండి అమలు చేస్తామని అధికార్లు జూలై 8న ప్రకటించారు. రుషికొండ బీచ్‌ని బ్లూ ఫ్లాగ్ బీచ్ గా కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఎంట్రీ ఫీజు లు, యూజర్ చార్జీలు వసూలు చేసి అభివృద్ధి చెయ్యాలని సూచించిందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ప్రజాపక్షంగా ఖండిస్తూ వెంటనే వార్వా, నివాస్ పత్రికా ప్రకటన ఇచ్చాయి. దీని పైన ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటం చెయ్యడానికి ప్లాన్ చేసుకున్నాయి. జూలై 9 వ తేదీన అన్ని పత్రికలలోనూ ఈ అంశం ప్రస్ఫుటంగా వచ్చింది. ఇతర ప్రముఖులు, ప్రజలు కూడా దీన్ని ఖండించారు. ఫలితంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ రుసుముని రద్దు చేసింది.

## ప్లాస్టిక్ బేగ్ రహిత దినం :

అంతర్జాతీయ ప్లాస్టిక్ బేగ్ ఫ్రీ డే ను పురస్కరించుకొని మధురవాడలోని హరిత అపార్ట్మెంట్స్ గేటెడ్ కమ్యూనిటీ వద్ద వార్వా నివాస్ ప్లాస్టిక్ బేగ్‌లు వాడడం వలన కలుగుతున్న అనర్థాలను తెలియపరుస్తూ చిత్రాలను ప్రదర్శించారు. ప్లాస్టిక్ బేగ్‌ల నిషేధాన్ని GVMC కఠినంగా అమలు చెయ్యాలని, ప్రజలు కూడా ప్లాస్టిక్ బేగ్‌లకు బదులుగా వస్త్రాల సంచులు, జ్యూట్ సంచులు వాడడం అలవాటు చేసుకోవాలని కోరారు.



# ఉన్మాదం తలకెక్కితే,

జాతి, మత మౌఢ్యం పెచ్చరిల్లితే

కూర్చున్న కొమ్మనే నరికేస్తుంది..

పాఠాలు నేర్పిన బడిని కూడా వదలకుండా నిప్పు పెడుతుంది.??

మణిపూర్ లో జరుగుతోందదే. ఏ స్కూల్‌లో అయితే పాఠాలు నేర్చుకున్నారో ,

అదే స్కూల్‌ను విద్యార్థులు ఉన్మాదంతో తగలబెట్టారు !!

ఈ విద్వేషంకు త్వరలో ముగింపు పలకకపోతే,

దశాబ్దాల వెనక్కి వెళ్లిపోవాల్సి వస్తుంది !!

వేల సంవత్సరాలుగా మన దేశంలో ఉచ్చరించబడుతున్న శాంతి మంత్రం ఇది !!

ఓం సహనావవతు !

సహనౌభునక్తు !

సహ వీర్యం కరవావహై !

తేజస్వి నా వధీతమస్తు

మా విద్విషా వహై !

అర్థం : మనం ఒకరినొకరు ద్వేషించుకోకుండా మిత్రభావంతో నడుచుకుందాం !!

ఇదే విశ్వశాంతికి దోహదకారి.

***

Editor : R. Ganesh Kumar,
Cell : 8332982809
Prepared on behalf of VARWA & NIVAS
e mail : nivasviskhacity@gmail.com
varwa.visakhapatnam@gmail.com

Address : B-25, jeevan Soudha Apartments, MMTC Colony,
Visakhapatnam-530022